


గౌతమ్ ఈ పెల్లాంటి మాటలనేసి కుట్టేసిన తేలు పొదలో కూర్చున్నట్లుగా ఉండిపోయాడు. మాటల ఆంతర్యం తెలియకుండానే నోటికేదొస్తే అదల్లా అనెయ్యడమేనా?

ఒకవేళ కావాలనే తన మనస్సును నొప్పించాడా?

ఎటూ నిర్ధారించుకోలేక చిరాగ్గా నొసలు చిట్లించింది సరోజ.

భర్త పొల్లుమాట అనకుండానే ఉండాల్సింది. మాట్లాడేశాడు కదాని ఆ మాటలో తప్పు తెలుసుకొని ముఖం తిప్పించి ఉన్నా తనింతగా మథనపడాల్సి వచ్చేదికాదు.

ఆడజాతిని విమర్శిస్తే తననూ అన్నట్లేగా?

ఉక్రోషంగా భర్త కేసి చూసింది సరోజ.

ఇంతకూ అసలేం జరిగిందంటే-

ఆవిడగారిని ఎదురుగా కూర్చోబెట్టుకుని ఆఫీసు కబుర్లు చెప్తూ- స్టెనో సోఫియా నీలికళ్ళకు ఆఫీసరు రామానుజం నల్లని కళ్ళకూ, మధ్య ఊసులకు ఆఫీసు వేళ ముగిసేవరకూ తెరిపి దే ఉండదు. ఆమెను లవ్‌చేసి పెళ్ళాడిన జాన్ ఇంట్లో ఉంటాడు. అమ్మాయిగారేమో ఆఫీసులో సరికొత్త ప్రణయాలు వెలగబెడ్తూ ఉంటుంది. అందుక్కారణం ఆవిడ భర్త అసమర్థత కావచ్చు. లేదా ఆమెకు తీరని కామదాహమైనా కావచ్చు.... అంటూ ఆడదాని పాతివ్రత్యానికి నిర్వచనం ఇచ్చాడు గౌతమ్.

అంతదాకా నాదస్వరం వింటూ మహదానందంగా తలూపుతూ, నాగుబాములా ఉన్న సరోజ, భర్త నిర్వచనంతో తక్కున నిశ్చేష్ట అయింది.

'మీ నిర్వచనాన్ని విత్‌డ్రా చేసుకోవాలిసార్.' అంది యమా సీరియస్‌గా. విస్మయంగా చూశాడు గౌతమ్.

"నేనేమన్నాను సరోజా ఉడుక్కుంటున్నావ్?"

"ఇంకా ఏమనాలండీ!? మీ మీద నాకెంత ప్రేమ! అలాంటి నన్ను పట్టుకొని బలవంతపు పతివ్రతనంటారా? మీకు చాటుగా వీలుంటే వ్యభిచరించేదాన్నా...."

బెంబేలెత్తిన గౌతమ్ క్షమార్పణ ధోరణిలో అన్నాడు. "నిన్ను ఉద్దేశించి అనలేదు సరూ! నా ఆరో ప్రాణానివి, నిన్ను పట్టుకుని అసభ్యంగా పేలుతానా? డ్యామ్ ఇన్‌సల్ట్ నాకే, సరేనా




## మీరూ పాల్గొనండి!

ఈ సంచిక నుంచి ప్రతి వారం ఓ చీకటి కార్టూన్! తప్పకుండా రామేస్సే రానవసరం లేదు.

ఈ వారం కార్టూన్ అందించిన వారు....

-యర్రంశెట్టి శాయి

ప్లీజ్ కంట్రోల్ యువర్ సెల్ఫ్ మా ఆఫీసులో సోఫియా గురించే కామెంట్ చేశాను అంతే!"

అతని ముఖం బేలగా కనపడేసరికి శాంతించింది సరోజ, "ఎప్పుడూ ఆడజాతినంతటినీ హీనంగా చూడకండీ తూలనాడకండీ! సోఫియాలాంటి కలుపు మొక్కలు అక్కడక్కడా ఉండొచ్చు, కాదనను. అలాగని ఆడజాతి మొత్తాన్నే ఆగాడికి కట్టెయ్యడం ఏం బాగోలేదు. మీ మగవాళ్ళలో సైతం ఎంత మందిని చూడ్డంలేదూ, ఇంట్లో భార్యనుంచుకొనీ బజారు ఆడవాళ్ళకోసం వెంపర్లాడడం...."

* * *

కుందనపు బొమ్మలా ఉంటుంది సరోజ. భూతద్దం పెట్టి వెతికినా ఆమెలో నైతికంగా ఏ మచ్చా కనపడదని గౌతమ్ విశ్వాసం! అఫ్‌కోర్స్! భర్త అన్నవాడికి భార్యమీద ఆ పాటి నమ్మకం అవసరమే. లేకుంటె సంసారం సజావుగా సాగదు.

కానీ అతనికే తెలియని ఒక చేదు నిజం ఆమె జీవితంతో ముడి పడి వుంది. అది ఆమెను పెళ్ళాడక ముందు సంగతి!

ప్రాయంలో రెండుజడలతో (ఆ రోజుల్లో హిందీతార సైరా బానులా, ఈరోజుల్లో శ్రీదేవిలా) చలాగ్గా ఉండేది సరోజ.

స్కూల్లో రమేష్‌తో ఆమెకు స్నేహం కుదిరింది. మామూలుగానే మాట్లాడుకునేవారు. వారి వయస్సు లక్షణమనీ చెప్పలేమూ, ఇద్దరికీ మనసులో ఎన్నాళ్ళనుంచి ఉందో అదీ చెప్పడం కష్టం, ఏమైతేనేం ఒకరోజు 'తరతాం'లో ఉండగా ఓకంట పడింది.

ఆ కన్ను కొన్నిటికీ.... ఆ కొన్ని మరికొన్నిటికీ.... అలా అలా.... సరోజ తల్లిదండ్రులు సంఘంలో తలెత్తుకోలేనంతగా పాకిపోయింది. వాళ్ళు కూతురు చదువు మాన్పించేసి కొన్నాళ్ళు దూరపు బంధువుల ఇంటికి తరలించారు.

ఇరుగూ పొరుగూ చెవులు కొరుక్కోవడం తగ్గు ముఖం పట్టాక కూతుర్ని పిలిపించుకుంది. కాని ఇంట్లోనే ప్రైవేట్ మాష్టార్ని రప్పించి సంగీతం - డాన్సు నేర్పించసాగారు.

"బాన్లే! చెడిన కూతురికి పెళ్ళెటూకాదు, దేవదాసీ విద్యలైనా నేర్పిస్తే తెలివిగా బ్రతికి పోతుందనీ...." కాకిగోల మళ్ళీ తలెత్తింది.

భరించలేక కూతుర్ని మరో చోటికి తరలించారు.

అక్కడున్నంచే సంబంధాలు వెతికి, అదే ఊర్లోనే హడావిడిగా కూతురి పెళ్ళి జరిపించేసి వారి గుండెలమీది భారాన్ని 'హమ్మయ్య!' అని దించేసుకున్నారు.

నవనవలాడుతూ, నేలమీద జీరాడేలా చీరెకట్టుతో, చేపపిల్లల్లాంటి చెంపకు చారెడేసికళ్ళు, మాటల్లో తేనెలూ, సెలయేరులా గలగలా నవ్వుతున్న నవవధువు సోయగాలకు ముగ్ధుడయ్యాడు గౌతమ్. సామాన్యంగా కొత్త పెళ్ళికొడుకులు మూడు రాత్రులూ ఇంటి గడప దాటరు.

మన గౌతమ్‌మాత్రం మూడు మాసాలపాటు ఏకధాటిగా సెలవు పెట్టి (ఆఫీసులో లీవు లేకున్నా లాస్ ఆఫ్ పే కండిషన్లో) సుఖం అంచులదాకా ఎగబ్రాకాడు.

ఇప్పుడు తాళికట్టిన గౌతమ్ పరిపూర్ణ సుఖాన్నీ, అనురాగాన్నీ అందిస్తూంటడంతో సర్వస్వం అతనుగానే భావించుకుంది సరోజ.

రోజులూ మధురంగానే దొర్లిపోతున్నాయి.

ఈవేళ సుమ్మడికాయల దొంగెవరంటే భుజాలు తడుముకున్నట్లు భర్త ఏదో అంటే అది తన గతం అతగాడికి తెలిసొచ్చి, పరోక్షంగా దెప్పిపొడుస్తున్నాడనే భీతి గిల్టీకాన్షస్సూ, తదితర ఆందోళనలూ జమిలిగా నానా హంగామాలో మునిగి ఇటు తనూ, అటు భర్తనూ కంగారుపర్చికానీ వదలలేదు సరోజ.

ముద్దుల భార్యామణిగారి ఆ నర్మ గర్భితాలేవీ తెలియని గౌతమ్ ఆమెకు పిచ్చో, మరే అమాయకతతోనో ఉన్నట్టుక్కుందని విస్తుపోక మరం చేస్తాడూ!

—వి.యం.ఎస్. స్వాతి



# తీయని బాధ

ఆరోజు నాకు బాగాగుర్తు....

నన్ను నా తల్లినుండి వేరు చేసినప్పుడు ఎంతో ఆవేదనచెందాను. ఒంటరిగానే జీవితం సాగిస్తున్నాను. కాని ఆరోజు ఆ ఇద్దరు నన్ను చూసి కళ్ళు పెద్దవిచేసారు. "ఒరే ఇది నీకు బాగా సరిపోతుందిరా" అన్నాడు. ఒకడు. ఆ మాటలలోని అర్థం గ్రహించాను. ఇద్దరు నేను వున్నచోటుకి వచ్చారు. ఒకడు నావైపుచూసి....

"అన్నీ బాగానే ఉన్నాయిరా. ఒడ్డు పొడవు అందం చందం పరవాలేదు. రేటు ఎంతో అడుగు" అన్నాడు.

రేటు చెప్పింది నా యజమాని.

రేటిచ్చి నన్ను కొనుక్కున్నారు. నేను వారి స్వంతమయ్యే సంబరం వాళ్ళలో కనిపిస్తోంది. నావంక తేరిపార చూసారు. "మట్టిలో మాణిక్యంలా మెరుస్తోందిరా అన్నిట్లో ఇదే బాగుంది" అన్నాడు నన్నుచూసి మురిసిపోతూ.

సిగ్గుతో ముడుచుకుపోయాను. నన్ను తేరిపారచూసి పైన చెయ్యివేసాడు. అప్పటికే ఎంతో మంది నన్నుచూసి విసిగెత్తారు. అయినా ఆ చేతిలో ఏదో విద్యుత్- నా శరీరంలో ఏదో పులకింత. గువ్వలా ఒదిగిపోయాను అతని చేతిలో. నన్ను సుతారంగా తాకుతూ బుగ్గలపై తన పెదవులతో తడిపాడు. నాలో తీపి అనుభూతి.

"నిన్ను ఉంచుకుంటాను" అన్నాడు నా కళ్ళలోకి చూసి. నిర్లిప్తంగా నవ్వాను.

ఎంతోమంది అలా అంటూనే చేతులువేసి తనివితీరాచూసి, బేరంచేసివెళ్ళారు. అందులో మీరు ఒకరేమో? నా అనుమానం.

ఆయన నావంక తేరిపార చూసి అందరిలాంటివాడ్నికాదు. నన్ను నమ్ము అన్నట్టు ముద్దులవర్షం కురిపించాడు. ఎందుకో అతని మాటలు అలా వింటూవుండాలని అనిపిస్తుంది నాకు. హాయిగా కళ్ళు మూసుకున్నాను.

నా ఒళ్ళంతా తన మెత్తని వేళ్ళతో మీటుతూ, ఎన్నో అనుభూతుల్ని కల్గించాడు. అతనిలోని సంస్కారం అర్థంలేనిదికాదు. అతని మాటల్లో నిజాయితీ ఉందనిపించింది.

కాని అతను నా నోటిని తన పెదవులతో మూసాడు. నను పువ్వులా చూస్తూ తనతో ఉంచుకున్నాడు.

తను వెళ్ళే ప్రతిచోటుకి నన్ను తీసుకొని వెళ్ళి తనకళతో నన్ను పరవశింపచేసి నాలో కొత్తరాగాలు పలికిస్తున్నాడు.

నాలోనాకే ఆశ్చర్యం. నేను ఇంతలా మారిపోయానా? అని ఎంతోమూగగా, ఒంటరిగా ఉన్న నేను సభలలో, సభికులతో, శ్రోతలతో ఉన్నాను ఇప్పుడు.

నాలో ఇంతకళ ఉందని, నన్ను ఇంత కళామయిగా తీర్చిదిద్దుతాడని కలలోకూడ ఊహించలేదు నేను. అందుకే అతని పాద దాసిగా అతనిచెంతనేఉండి జన్మ ధన్యం చేసుకున్నాను. నా కారణంగా అతని కీర్తిప్రతిష్టలు ప్రజ్వరిల్లినందుకు ఆనందంతో ఆనందభైరవి ఆలపిస్తున్నాను.

ఇంతకీ నేను ఎవరినో, నాపేరేమిటో....

నేను... నేను వేణువుని. పిల్లనగ్రోవిని.... వెదురుపొదల తల్లి నుండి వేరుచేయబడిన పిల్లని. పిల్లనగ్రోవిని.

—జి. హరిప్రసాద్